పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టిసారించాలి

● జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి

మాట్లాడుతున్న ప్రేమ్ కరణ్ రెడ్డి

మిర్యాలగూడ రూరల్, మార్చి 25 : అన్ని గ్రామ పంచాయతీల్లో అస్తిపన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈఓ నంద్యాల ప్రేమ్‌కరణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వరి కోతలు ముగిసిన తర్వాత జాబ్‌కార్డు ఉన్న వారు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. సమావేశంలో డివిజన్ పంచాయతీ అధికారి రాఘవరావు, ఎంపీడీఓ శేషగిరి శర్మ, ఎంపీఓ రమేశ్, మిషన్‌భగీరథ డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈలు ఉమా మహేశ్వరి, వరలక్ష్మి, సింధు పాల్గొన్నారు.

ఎంజీయూ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

ఎంజీయూ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

రామగిరి, మార్చి 25 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ జట్టును మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ పోటీలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.నాగిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఎంజీయూ ఉమెన్స్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని విక్రమ్ సింహపురి యూనివర్సిటీలో ఏప్రిల్ 30 నుంచి మే 3 వరకు జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించిన ప్రతిభ కనబర్చిన 16 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ హరీశ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వై.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి, ఖేలో ఇండియా ప్రత్యేకాధికారి బి.సోమలింగం పాల్గొన్నారు.

50 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చండూరు, మార్చి 25: చండూరు జడ్పీహెచ్‌ఎస్‌లో 1974–75 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం హైదరాబాద్‌లో ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. 50 ఏండ్ల అనంతరం స్నేహితులు కలుసుకొని తమకు చదువు చెప్పిన గురువు పాంపాటి మధుసూదన్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా కాసాల నర్సిరెడ్డి(నల్లగొండ గద్దర్) పాల్గొని అలరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుర్రం భిక్షమయ్య, రామచంద్రం, తోట రంగయ్య, పున్న వెంకటేశం, రామారావు, విష్ణువర్ధన్, బాబూరావు, మార్కండేయ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న నిందితుల అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, మార్చి 25: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య కొత్తగూడెం గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంగా రోడ్డు పక్కన ఆపి ఉంచిన లారీ, బొలేరో వాహనాలను తనిఖీ చేశారు. వాటిలో 66 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారు పారిపోగా లారీ డ్రైవర్ అమ్మోరును అరెస్ట్ చేసి విచారించగా నర్సింహారావు, నరేందర్, చంద్రశేఖర్, అప్పారావుల ప్రమేయం ఉన్నట్లు వెల్లడించాడు. నాగార్జునసాగర్ సమీపంలో సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టగా 20 బస్తాల రేషన్ బియ్యంతో ఆంధ్రాకు వెళ్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకొని బియ్యం తరలిస్తున్న నెమలి నాగిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వాహనంలో ఉన్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల్లో నిందితులు నాగిరెడ్డి, చంద్రశేఖర్, మధును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించారని, ఈ విషయమై మరింత లోతుగా విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, సాగర్ సీఐ బీసన్న, ఎస్‌ఐలు లక్ష్మయ్య, సంపత్ పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి : వరి ధాన్యానికి మద్దతు ధర క్వింటాకు రూ.2800 చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం క్వింటా ధాన్యానికి రూ.2800 ఇవ్వగా నేడు మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రూ.2200 నుంచి రూ.2300 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రెమడాల పరుశురాములు, రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, పుల్లెంల శ్రీకర్, కోడిరెక్క వెంకన్న, చల్లబొట్ల ప్రణీత్ రెడ్డి, వడ్డెగాని సైదులు పాల్గొన్నారు.

వీఓఏల ముందస్తు అరెస్ట్

శాలిగౌరారం, మార్చి 25 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరు తూ వీఓఏలు మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న వీఓఏలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీపై విడుదల చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బైరవునిబండ, గురజాల, చిత్తలూర్, రామాంజపురం గ్రామాల వీఓఏలు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యవర్గం

మునుగోడు, మార్చి 25 : భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా చాపల శ్రీను, పందుల పెద్ద నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బెల్లం శివయ్య, అధ్యక్షుడిగా పందుల చిన్న నరసింహ, కార్యదర్శిగా ఈద రాములు, ఉపాధ్యక్షులుగా దేవల మాలాద్రి, దర్శనం పాండు, సహాయ కార్యదర్శులుగా బొల్లు సైదులు, గోలి హుస్సేన్, యాసరాని వెంకన్న, కోశాధికారిగా భీమనపల్లి స్వామి, కార్యవర్గ సభ్యులుగా దొమ్మాటి గిరి, ఎన్.లింగస్వామి, ఏరుకొండ నగేశ్, పెరుమాళ్ల రామలింగయ్య, ఆరెకంటి పాపయ్య, పందుల మారయ్య, జె.లింగస్వామి, గాదపాక ఎల్లయ్య ఎన్నికయ్యారు.

పశువులు తరలిస్తున్న వాహనం బోల్తా

నకిరేకల్, మార్చి 25 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తునికి చెందిన బాలనాగు, నాని, సూరిబాబులు అశోక్ లేలాండ్ వాహనంలో పైభాగంలో కొబ్బరి బోండాలు, కింద ఆవు దూడలు ఉంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మంగళవారం మండలంలోని కడపర్తి జాతీయ రహదారిపై బోల్తా పడింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఒక దూడ మృతిచెందగా మరో రెండింటికి గాయాలయ్యాయి. గాయపడిన వాటికి పశువైద్యాధికారులు చికిత్స అందించారు. అనంతరం 12 దూడలను నల్లగొండలోని గోశాలకు తరలించారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి రైతు మృతి

గుర్రంపోడు, మార్చి 25: మండలంలోని వద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు వద్దిరెడ్డి రవీందర్ రెడ్డి (55) సోమవారం ట్రాక్టర్ పైనుంచి జారిపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రవీందర్‌రెడ్డి ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకు వస్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ ఆపి కిందికి దిగే ప్రయత్నం చేస్తూ జారిపడడంతో గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇఫ్తార్‌లో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పక్కన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, మార్చి 25 : యాసంగి ధాన్యం కొనుగోలుకు రైస్ మిల్లర్లు సహకారం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై రైస్‌మిల్లర్లు, పౌరసఫరాల, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మిల్లర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందన్నారు. పెండింగ్ ట్రాన్స్‌పోర్టు బిల్లుల చెల్లింపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దని, ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాలశఖాఖ జిల్లా మేనేజర్ హరీశ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయా దేవి, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్

రామగిరి : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముస్లింలకు జిల్లా పోలీసు ఆడిటోరియంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమేశ్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్ రాజు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు ముస్లింలు పాల్గొన్నారు.

మాచన రఘునందన్‌కు అరుదైన గౌరవం

మాల్, మార్చి 25 : పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మాచన రఘునందన్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాకు చెందిన వైద్య ఆరోగ్య మాస పత్రిక పల్మనరీ మెడిసిన్ ఏప్రిల్‌లో నిర్వహించే సదస్సులో పాల్గొనాలని తనకు ఆహ్వానం అందినట్లు రఘునందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 ఏండ్లుగా పొగాకు నియంత్రణకు తాను చేస్తున్న కృషిని గుర్తించిన ఢిల్లీకి చెందిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఏయిమ్స్) వారు వరల్డ్ టీబీడే సందర్భంగా నిర్వహించే సదస్సుకు తనను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 2020లో జర్మనీ, 2022లో దక్షిణఆఫ్రికా, 2023, 24లో ఆస్ట్రేలియాలో జరిగిన సదస్సుల్లో తాను పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

కట్టంగూర్, మార్చి 25 : మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన మేడ శివకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ మంగళవారం వారి ఇంటికి వెళ్లి శివకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, నాయకులు ఊట్కూరి ఏడుకొండలు, గుండాల మల్లేశ్, మేకల రమేశ్, రేకల రాజు, చిట్టిమల్ల నర్సింహ, మహేశ్వరం వెంకన్న, చెవుగోని సాయిలు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు

మిర్యాలగూడ రూరల్ :కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కాల్వపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నామా అలెగ్జాండర్‌కు మంగళవారం మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు భోగబోయిన వెంకటరమణా చౌదరి పరామర్శించారు. రూ.31 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నూకపంగు శ్రీనివాస్, మల్లికంటి రేణుబాయి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, బోగబోయిన రాజా, నెహ్రూనాయక్, సూర్య, సైదా, రవి, దుండిగ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చౌళి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పరామర్శ

దేవరకొండరూరల్, మార్చి 25 : మండలంలోని రత్య తండాకు చెందిన రమావత్ చౌళి మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండాకు వెళ్లి చౌళి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్‌స వైస్ చైర్మన్ ఉమేందర్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

29న ఉగాది కవి సమ్మేళనం

దేవరకొండరూరల్, మార్చి 25 : ఉగాది పండుగ సందర్భంగా తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక అధ్యయన వేదిక(తెస్సా) ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు దేవరకొండ గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పర్చా వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కవులు, సాహితీ అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వయం ఉపాధిపై విద్యార్థులకు అవగాహన

రామగిరి, మార్చి 25: ఎంజీయూలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సంస్థ బాధ్యుడు జె.కోటేశ్వర్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, పీఓలు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు డెస్క్ బెంచీల అందజేత

మునుగోడు, మార్చి 25 : లయన్స్‌క్లబ్ గోల్డ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పులిపలుపుల పాథమికోన్నత పాఠశాలకు రూ.25వేల విలువైన డెస్క్ బెంచీలు, జడ్పీహెచ్ఎస్ కొరటికల్‌కు స్పోర్ట్స్ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, పీఆర్‌టీయూ నాయకులు సుంకరి భిక్షంగౌడ్, క్లబ్ రీజినల్ మేనేజర్ ప్రదీప్, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, విజయ్, రవి, ఉమ, నాగరాజు, మదనాచారి పాఠశాల హెచ్‌ఎం డి.కళావతి, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు యూసుఫ్‌పాషా పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడికి ఎమ్మెల్యే బీఎల్ఆర్ అభినందన

కార్తికేయను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 25 : చెస్‌లో నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన గుండా కార్తికేయను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్ల వయస్సులోనే కార్తికేయ చెస్‌లో రికార్డు సాధించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు సంపాదించడం గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో అతను ప్రపంచస్థాయి గ్రాండ్ మాస్టర్‌గా ఎదుగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్తికేయ తల్లిదండ్రులు మహేశ్, చంద్రకళ, కోచ్ మాశెట్టి దివ్యశ్రీ, మాశెట్టి శ్రీనివాస్, మహబూబ్‌అలీ, బెజ్జం సాయి, ఖాజా హమీదొద్దీన్, ఎండీ.అస్లాం పాల్గొన్నారు.

మహిళలపై దాడులు చేయడమేనా ఇందిరమ్మ రాజ్యం

పెద్దవూర : నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

మర్రిగూడ/ పెద్దవూర, మార్చి 25 : తమ హక్కుల సాధనకు పోరాటం చేస్తున్న ఆశా కార్యకర్తలపై దాడులు చేయడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆశా కార్యకర్తల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం మర్రిగూడ, పెద్దవూరలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలని కూడా చూడకుండా ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు వలవంతంగా తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యుడు సలివోజు రామలింగాచారి, పొనుగోటి సునీత, పగడాల బాలమణి, రాణి, పద్మ, సైదా బేగం, దుర్గమ్మ, విజయ, మంజుల, పెద్దవూరలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణ, నాయకులు ఎస్‌కె.బషీర్, జంపాల వెంకటమ్మ, నాగార్జున, మల్లయ్య, ఆశాలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల అరెస్ట్

చందంపేట(దేవరకొండ): ఆశా కార్యకర్తల ఆందోళన నేపథ్యంలో మంగళవారం దేవరకొండ పోలీసులు పలువురు ఆశా కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సుశీల, బద్రూ, స్వప్న, మల్లీశ్వరి ఉన్నారు.

కృత్రిమ మేథ సాయంతో నాణ్యమైన విద్య : డీఈఓ భిక్షపతి

ల్యాబ్‌ను ప్రారంభించి విద్యార్థులకు వివరిస్తున్న డీఈఓ

నల్లగొండ రూరల్,మార్చి 25: కృత్రిమ మేథ సాయంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ–ఎక్స్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ అధికారి రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న ప్రజా సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా

రామగిరి, మార్చి 25: ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కమిటి సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య తెలిపారు. నల్లగొండలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ శ్రేణులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు తుమ్మల పద్మ, గాదె నరసింహ, భూతం అరుణ, అవుట రవీందర్ పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఇఫ్తార్

రామగిరి, మార్చి 25 : జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. టీఎన్‌జీఓస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘం నాయకులు, పట్టణ ముస్లింలు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన రైతులకు నేటికీ అందని బోనస్

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి

సమావేశంలోమాట్లాడుతున్న వల్లపురెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 25 : రాష్ట్రంలో ధాన్యం విక్రయించిన రైతులందరికీ బోనస్ అందించినట్లు దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్ అసెంబ్లీలో చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి అన్నారు. మంగళవారం అంగడిపేట స్టేజీవద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఏపల్లి మండలంలో 890 మంది రైతులు ధాన్యం విక్రయించగా కేవలం 90 మంది రైతులకు మాత్రమే బోనస్ చెల్లించారని, 11,900 మంది రైతులు రుణాలు తీసుకోగా కేవలం 5,965 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని తెలిపారు. అర్హులైన రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవరకొండ నియోజవర్గంలో ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు వేశారని, అసలు రోడ్డు సౌకర్యం లేదని ఎమ్మెల్యే చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుతం వేసవిలో గ్రామాల్లో తీవ్ర తాగు నీటి కొరత, విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని నివారణకు ఎమ్మెల్యే చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అర్వపల్లి నర్సింహ, రాయినబోయిన శ్రీను, యర్ర యాదగిరి, సుధాకర్, గోలి గిరి, నరేందర్, బొడ్డుపల్లి మహేందర్, జగన్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

● బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి

అడ్లూర్‌లో ఎండిన వరి చేనును పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి

శాలిగౌరారం, మార్చి 25 : సాగునీరందక ఎండిపోయిన రైతుల పంట పొలాలకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అడ్లూర్ గ్రామంలోని పలువురి రైతుల పంట పొలాలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు సరిగా అందించక పోవడం, నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించక పోవడంతో రైతులు యాసంగిలో సాగు చేసిన వరితో పాటు నిమ్మ, బత్తాయి తోటలు కూడా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరానికి రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దోనకొండ అంజయ్య, మాజీ సర్పంచులు బోడ నర్సయ్య, కడమంచి వెంకటయ్య, రైతులు ఉన్నారు.

పేదలకు ఆపన్న హస్తం

ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ

నిడమనూరు, మార్చి 25 : నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడమే అమ్మానాన్న ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ పూలపూడి బాలకృష్ణ అన్నారు. బంకాపురం గ్రామానికి చెందిన కొంగల ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దాంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 132 మంది దాతల నుంచి సేకరించిన రూ.1,07,700ను మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఉన్నం చిన్నవెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పాంపాటి యాదగిరి, గుండంరాజు వెంకటేశ్వరరావు, గుండా లింగయ్య, బండారు రామయ్య, సుదేశ్వర్ రావు, బొంగరాల శ్రీనివాస్, రాంబాబు, చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

● బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కిషన్‌నాయక్

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నేనావత్ కిషన్‌నాయక్

కొండమల్లేపల్లి, మార్చి 25 : గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు తేవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఇస్లావత్ అభిషేక్‌నాయక్, నేనావత్ రమేశ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, లతీఫ్, హబీబ్, అభిరూబ్, అఖిల్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

న్యాయవాది హత్యను నిరసిస్తూ కోర్టు విధుల బహిష్కరణ

మిర్యాలగూడ కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మిర్యాలగూడ, మార్చి 25: హైదరాబాద్ చంపాపేటకు చెందిన న్యాయవాది ఇజ్రాయెల్ హత్యను నిరసిస్తూ మంగళవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వేలాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎండీ.ఇబ్రహీం, ట్రెజరర్ పవన్‌కుమార్, న్యాయవాదులు కె.శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, కొంక వెంకన్న, జిన్నా శ్రీను, లింగంపల్లి శ్రీను, సాయి, భాస్కర్, వేణు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

చిట్యాల : ధర్నాలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

కట్టంగూర్/చిట్యాల, మార్చి 25 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కట్టంగూర్, చిట్యాల తాసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా రూ.12వేలు ఇస్తామని చెప్పి నేడు అనేక కొర్రీలు పెట్టి ఇవ్వడం లేదని విమర్శించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసీల్దార్లకు అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గంజి మురళీధర్, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, నాయకులు గడగోజు రవీంద్రాచారి, కట్ట బక్కయ్య, జాల రమేశ్, ఊట్కూరి యాదయ్య, సుజాత, శ్రీను, ఆంజనేయులు, చిట్యాలలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, సరోజ, అర్రూరి శ్రీను, పామనుగుండ్ల అచ్చాలు, సుధాకర్‌రెడ్డి, కుమారస్వామి, శంకరయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : పంటలు ఎండిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న డిమాండ్ చేశారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు పెద్దులు, కొప్పు శ్రవణ్, దండు రవి, ఐలయ్య, సైదులు, రామచంద్రం, భగవంత రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నిడమనూరు : ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్, నాయకులు కొమాండ్ల గుర్వయ్య, చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ పాల్గొన్నారు.

పెద్దవూర : సీపీఎం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, ఎస్‌కే.బషీర్, మల్లయ్య, నాగార్జున పాల్గొన్నారు.

మునుగోడు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, మండల కార్యదర్శి సాగర్ల మల్లేశం, నాయకులు మిర్యాల భరత్‌కుమార్, యాస రాణి శ్రీను, వేముల లింగస్వామి, వంటపాక రమేశ్, యాట యాదయ్య పాల్గొన్నారు.

మాల్ : చింతపల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, నాయకులు కంబాలపల్లి ఆనంద్, మండల కార్యదర్శి ఉడుగుండ్ల రాములు, నాయకులు పాల్గొన్నారు.

దామరచర్ల : సీపీఎం నాయకులు తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

పులిచర్లలో పశువైద్య శిబిరం

పెద్దవూర, మార్చి 25: మండలంలోని పులిచర్ల గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని మంగళవారం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి ప్రారంభించారు. శిబిరంలో వ్యాధుల బారిన పడిన గేదెలు, గొర్రెలకు వైద్యాధికారి చికిత్స అందించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డైరెక్టర్లు లక్ష్మయ్య, గౌస్, రఘుపతిరెడ్డి, కోట నాగిరెడ్డి, పగడాల నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆకాంక్ష విద్యార్థి

హాలియా, మార్చి 25 : జాతీయస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు స్థానిక ఆకాంక్ష పాఠశాల విద్యార్థి ఎం.పవన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పవన్ పాల్గొని ప్రతిభ కనబర్చగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు బీహార్ రాష్ట్రంలోని గయాలో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పవన్ తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. పవన్‌ను పాఠశాల డైరెక్టర్లు మోహన్‌రావు, ఉన్నం శ్రీను బాబు, శ్రీనివాస్‌గుప్తా, వైస్ ప్రిన్సిపాల్ కరీం, పీఈటీ చంద్రశేఖర్ అభినందించారు.